GSTIN-NO:36FKPSI308PIZX
epaper:tmedia.net.in
T MEDIA టి-మీడియా
సామాజికం... ప్రజల పక్షం
మెయిన్ : ఆదివారం - అక్టోబర్ 22-2023 పేజీలు : 3

## నాలుగేళ్ల తర్వాత స్వదేశానికి కాలు మోపిన మాజీ ప్రధాని

**టీ మీడియా, అక్టోబర్ 21, న్యూఢిల్లీ :**



పాకిస్థాన్ ముస్లింలీగ్ (ఎన్) అధ్యక్షుడు, పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ నాలుగేళ్ల తర్వాత తొలిసారిగా స్వదేశీ గడ్డపై అడుగుపెట్టారు. వివిధ కేసుల్లో కోర్టు విచారణలు ఎదుర్కొంటున్న షరీఫ్ గత నాలుగేళ్లుగా లండన్‌లో ఉంటున్నారు. తాజాగా కుటుంబ సభ్యులు, పార్టీ సీనియర్ నేతలతో లండన్ నుంచి సౌదీ అరేబియా మీదుగా దుబాయ్ చేరుకున్న షరీఫ్ అక్కడి నుంచి ప్రత్యేక ఛార్టెడ్ విమానంలో పాకిస్థాన్‌కు బయల్దేరారు. ఇస్లామాబాద్ చేరుకున్న ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు.మరోవైపు పాక్ సైన్యంతో లోపాయికారీగా రాజీ పడటం వల్లనే నవాజ్ స్వదేశానికి వచ్చినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. కోర్టు కేసులు ఎదుర్కొంటున్న నవాజ్ కోసం న్యాయపరంగా, రాజకీయపరంగా పలు సవాళ్లు ఇక్కడ కాచుకు కూర్చున్నాయి. ఏవెన్ ఫీల్డ్, అల్ అజీజియా అవినీతి కేసుల్లో ఆయనకు ఈ నెల 24 వరకు ఇస్లామాబాద్ హైకోర్టు ముందస్తు బెయిలు ఇచ్చింది. తోషాఖానా, వాహనాల కేసులో ఆయనపై అరెస్టు వారెంటును అవినీతి నిరోధక కోర్టు అదే తేదీ వరకు రద్దు చేసింది. ఈ భరోసాలతోనే నవాజ్ అరెస్టు భయం లేకుండా పాక్‌లో తిరిగి కాలు మోపగలిగినట్లు సమాచారం.

# ఐదు రాష్ట్రాల్లో మోదీ ప్రచారం

**షెడ్యూల్ ఖరారు!**



**టీ మీడియా, అక్టోబర్ 21, న్యూఢిల్లీ :**

దేశవ్యాప్తంగా ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నిక ప్రచార షెడ్యూల్ ఖరారైంది. ప్రధాని మోదీ రాజకీయ ర్యాలీలో పాల్గొని ప్రసంగించనున్నారు. ఈ మేరకు బీజేపీ కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ ఎన్నికలకు సంబంధించి పోస్టర్ బాయ్‌గా ప్రధాని నరేంద్ర మోదీని బీజేపీ నిలబెట్టింది. ప్రధాని మోదీ ఐదు రాష్ట్రాల్లో మొత్తం 34 నుండి 35 ర్యాలీలు నిర్వహించనున్నారు. వీటిలో మధ్యప్రదేశ్‌లో మొత్తం 11 ర్యాలీలు, రాజస్థాన్‌లో 10 ర్యాలీలు, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌ల్లో 6 ర్యాలీల చొప్పున, మిజోరంలో ఒక ర్యాలీలో మోదీ పాల్గొంటారని బీజేపీ వర్గాలు వెల్లడించాయి.ప్రధాన మంత్రి నరేంద్రమోడీ అక్టోబర్ 21న మధ్యప్రదేశ్‌లో ఐదు రాష్ట్రాల ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తారు. అనంతరం వరుసగా అయా రాష్ట్రాల్లో పర్యటిస్తున్నారు. అయితే పీఎంవో కార్యాలయం తెలిపిన వివరాల ప్రకారం మధ్యప్రదేశ్ పర్యటనలో భాగంగా సింధియా స్కూల్ 125వ వ్యవస్థాపక దినోత్సవాన్ని జరుపుకునే కార్యక్రమానికి హాజరుకానున్నారు. ఈ కార్యక్రమానికి రాజకీయ ప్రాధాన్యత లేదని తెలిపింది. ప్రధానమంత్రి కార్యాలయం ప్రకారం, పాఠశాలలో బహుళ ప్రయోజన స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేస్తారు. విశిష్ట పూర్వ విద్యార్థులు, అత్యుత్తమ సాధకులకు వార్షిక అవార్డులను అందజేస్తారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలనుద్దేశించి మోదీ ప్రసంగించనున్నారు.సింధియా స్కూల్ 1897లో అప్పటి గ్వాలియర్ రాచరిక రాష్ట్రంచే స్థాపించబడింది. ఇది చారిత్రాత్మక గ్వాలియర్ కోటపై ఉంది. కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా సింధియా రాజకుటుంబానికి చెందిన వారసుడు. మధ్యప్రదేశ్‌కు చెందిన ప్రముఖ నాయకుడు. ఇదిలావుంటే నవంబర్ 17న మధ్యప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.గత రెండు లోక్‌సభ ఎన్నికల మాదిరిగానే, మధ్యప్రదేశ్ ఓటర్లు అసెంబ్లీ ఎన్నికల్లో తమకు నేరుగా మద్దతు ఇస్తారని, డబుల్ ఇంజన్ ప్రభుత్వాన్ని ఎన్నుకుంటారని ప్రధాని నరేంద్ర మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి రాసిన లేఖలో, మధ్యప్రదేశ్‌తో తనకు ఎప్పుడూ ప్రత్యేక అనుబంధం ఉందని, అందుకే 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని అపూర్వమైన విజయాలకు దారితీస్తున్న సమయంలో ప్రజలు తనపై అపరిమితమైన ప్రేమను కురిపించారని మోదీ అన్నారు.



## కాంగ్రెస్ అసమర్థత వల్లే కర్ణాటకలో కరెంట్ కష్టాలు

**మంత్రి కేటీఆర్**

**టీ మీడియా, అక్టోబర్ 21, హైదరాబాద్ :**

కాంగ్రెస్ అసమర్థత వల్లే కర్ణాటకలో కరెంట్ కష్టాలు ఏర్పడ్డాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తగినంత విద్యుత్ సరఫరా చేయడంలో విఫలమైనందున, రాష్ట్ర వ్యాప్తంగా రైతులు నిరసనలు వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రైతులకు కాంగ్రెస్ పార్టీ అసమర్థత గురించి తెలుసని, దశాబ్దాలుగా ఆ బాధలు ఎదుర్కొన్నారని, ఇప్పుడు

మిగతా 2 లో

## ఆరుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లు కట్

- కాంగ్రెస్‌లో భగ్గుమన్న అసమ్మతి

**టీ మీడియా, అక్టోబర్ 21,మధప్రదేశ్ :**



అసెంబ్లీ ఎన్నికల కోసం కాంగ్రెస్ తన రెండవ జాబితాను అక్టోబర్ 19న విడుదల చేసింది. అప్పటి నుంచి ఆ పార్టీ చాలా చోట్ల అసమ్మతిని ఎదుర్కొంటోంది. నిజానికి ఆరుగురు కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టిక్కెట్లు ఇవ్వలేదు. దీంతో రాష్ట్రంలోని ఈ ఎమ్మెల్యేలు పార్టీపై తిరుగుబాటు బావుటా ఎగురవేశారు.నవంబర్ 2020లో జరిగిన అసెంబ్లీ ఉప ఎన్నికల్లో జ్యోతిరాదిత్య సింధియా విధేయులపై నలుగురు తిరుగుబాటు

మిగతా 2 లో

## 365 రోజులు ప్రజల మధ్యలో ఉండటమే

- ఎంఐఎం మేనిఫెస్టో రిలీజ్!

**టీ మీడియా, అక్టోబర్ 21,హైదరాబాద్**



:తెలంగాణ ఎన్నికల వేళ ఓటర్లపై రాజకీయ పార్టీలు వరాలు జల్లులు కురిపిస్తామని హామీ ఇస్తున్నాయి. తమ పార్టీకి అధికారం అప్పగిస్తే మహిళలకు, సామాజికవర్గాల వారీగా పెద్ద పీట వేస్తామని ఓటర్లను తెగ ఆకట్టుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ అన్ని పార్టీలు అభ్యర్థుల ఎంపికతో పాటు మేనిఫెస్టోలతో ప్రజల్లోకి దూసుకెళ్తున్నాయి. ఇప్పటికే అధికార పార్టీ బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు అభ్యర్థులను

మిగతా 2 లో

## ఏపీలో పోలీస్ సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట

- ఏపి సిఎం జగన్

**టీ మీడియా, అక్టోబర్ 21, విజయవాడ :**



ఏపీలో పోలీస్ సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని.. వైద్య, ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యతనిస్తూ.. ఆరోగ్య భద్రత కల్పిస్తోంది. ఏపీతో పాటు హైదరాబాద్‌లో గుర్తించిన 283 ఆస్పత్రుల ద్వారా చికిత్స అందిస్తోందని సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఉదయం విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో ఆయన పాల్గొని.. విధి

మిగతా 2 లో



# కమింగ్ సూన్

## ఏ క్షణమైనా కాంగ్రెస్ రెండో జాబితా

**టీ మీడియా, అక్టోబర్ 21,హైదరాబాద్:**

కమింగ్ సూన్.. తెలంగాణ ఎన్నికలు దగ్గరపడుతున్నాయి. దీంతో కాంగ్రెస్ పార్టీ సెకెండ్ లిస్ట్ పై కసరత్తులు చేస్తోంది.. ఏ క్షణమైనా కాంగ్రెస్ అభ్యర్థుల రెండో జాబితా వచ్చే చాన్సుంది. ఢిల్లీలో చర్చలు భీకరంగా కొనసాగుతున్నాయి. బీ అలర్ట్ అంటూ హెచ్చరికలు జారీ చేశారు స్క్రీనింగ్ కమిటీ ఛైర్మన్ మురళీధరన్. ఢిల్లీలో కేసీ వేణుగోపాల్‌తో మురళీధరన్ సమావేశమయ్యారు. ఈ సమావేశానికి తెలంగాణ పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి, ఠాక్రే, ఉత్తమ్ కుమార్ రెడ్డి, భట్టి విక్రమార్క హాజరయ్యారు. రెండో విడత అభ్యర్థుల జాబితాపై హాట్ హాట్ గా చర్చలు కొనసాగుతున్నాయి. ఏ క్షణమైనా రెండో జాబితా విడుదల అవుతుందని.. మురళీధరన్ చెప్పడంతో కాంగ్రెస్ ఆశావహులు, శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది. సెకండ్ లిస్టులో 64 మంది పేర్లు ఉంటాయా? లేక మూడో లిస్టు కూడా ఉంటుందా..? అనేది తెలాల్సి ఉంది. అయితే, ఇక్కడ మరో ట్విస్టు కూడా ఉంది. కామ్రెడ్లతో పొత్తుగురించి పార్టీలో విస్తృతంగా చర్చ జరుగుతోంది.సీపీఐ, సీపీఎంతో సీట్ల సర్దుబాటుపై ఇంకా చర్చలు జరుగుతున్నాయని ఫైనల్ కాలేదంటూ మురళీ ధరన్ చెప్పారు. ఈ క్రమంలో కామ్రెడ్లకు ఎన్ని సీట్లు ఇస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ఐదేసి సీట్ల చొప్పున సీపీఐ, సీపీఎం ప్రతిపాదనలు పెడితే.. రెండేసి చొప్పున ఇచ్చేందుకు కాంగ్రెస్ ఒప్పుకున్నట్లు తెలుస్తోంది. సీపీఐకి కొత్తగూడెం, చెన్నూరు సీట్లు, సీపీఎంకు మిర్యాలగూడ, వైరా స్థానాలు ఇవ్వాలని నిర్ణయించడం కాంగ్రెస్‌లో కలకలం రేపుతోంది. దీనిపై మరింత క్లారిటీ రావాలని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.చెన్నూరు సీటును సీపీఐకి ఇవ్వొద్దంటూ స్థానిక కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేస్తుంటే.. అటు వైరాలో దాదాపుగా సేమ్ సీన్ కొనసాగుతోంది. పొత్తులో భాగంగా తమ సీటును సీపీఎంకు ఇవ్వొద్దంటూ ఆందోళనకు దిగారు కాంగ్రెస్ నేతలు. గెలిచే సీట్లను కమ్యూనిస్టులకు ఇవ్వొద్దంటూ సూచిస్తున్నారు.కాంగ్రెస్ పార్టీ రిలీజ్ చెయ్యబోయే సెకండ్ లిస్టు ఎలా ఉండబోతోంది.. పొత్తు లెక్కల్ని, అసమ్మతుల్ని ఎలా హ్యాండిల్ చెయ్యబోతున్నారు.. మిగతా 64 సీట్లూ సెకండ్ లిస్టులో రాబోతున్నాయా.. లేక థర్డ్ లిస్ట్ అంటూ ఇంకోటి ఉండబోతోందా..అనేది చర్చనీయాంశంగా మారింది.ఇదిలాఉంటే.. మేనిఫెస్టో విడుదలకు కూడా ముహూర్తం ఫిక్సయినట్టుంది. తామిచ్చే ప్రామిస్‌లు బీఆర్ఎస్, బీజేపీలకు దీటుగా ఉంటాయంటూ కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థుల జాబితా విడుదల..

## 33 మంది అభ్యర్థులకు టిక్కెట్లు

- సర్దార్‌పురా నుంచి అశోక్ గెహ్లాట్
- సచిన్ పైలట్ మళ్లీ టోంక్ నుండి

**మీడియా, అక్టోబర్ 21,రాజస్థాన్:**



అసెంబ్లీ ఎన్నికలు 2023 కోసం అధికార పార్టీ కాంగ్రెస్ తన మొదటి అభ్యర్థుల జాబితాను కూడా విడుదల చేసింది. ఈ జాబితాలో మొత్తం 33 మంది పేర్లను ప్రకటించారు. ఇందులో ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్‌కు సర్దార్‌పురా నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నారు. అదే సమయంలో మరో కాంగ్రెస్ సీనియర్ నేత సచిన్ పైలట్ మళ్లీ టోంక్ నుండి ఎన్నికల బరిలోకి దిగారు. లక్ష్మణ్‌గఢ్ నుంచి రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ సింగ్ దోటసారాను అభ్యర్థిగా నియమించారు. ఇది కాకుండా, సీపీ జోషికి నాథద్వారా నుండి టికెట్ లభించింది.ఈసారి కాంగ్రెస్ నుంచి నోహర్ నుంచి అమిత్ చౌహాన్, కొలయాత్ నుంచి భన్వర్ సింగ్ భోటీ, సదల్‌పూర్ నుంచి కృష్ణ పూనియా, సుజన్‌గఢ్ నుంచి మనోజ్ మేఘ్‌వాల్, మాండ్వా నుంచి రీటా చౌదరి, విరాట్‌నగర్ నుంచి ఇంద్రజ్ సింగ్ గుర్జార్, మాల్వియా నగర్ నుంచి అర్చన శర్మ, పుష్పేంద్ర భరద్వాజ్, సాంగ్నర్ నుంచి పుష్పేంద్ర భరద్వాజ్‌లు బరిలో నిలిచారు. మాండావర్ నుంచి కుమార్ యాదవ్, అల్వార్ నుంచి తికారాం, జూలీ సిక్రాయ్ నుంచి మమతా భూపేశ్‌కు టికెట్ ఇచ్చారు.ఇది కాకుండా, సవాయ్ మాధోపూర్ నుండి డానిష్ అబ్రార్, లద్నూన్ నుండి ముఖేష్ భాకర్, దిద్వానా నుండి చేతన్ సింగ్ చౌదరి, జయల్ నుండి మంజు దేవి, దేగానా నుండి విజయపాల్ మిర్ధా, పర్బత్సర్ నుండి రామ్నివాస్ గవారియా, ఒసియన్ నుండి దివ్య మాదెర్నా, జోధ్పూర్ నుండి మనీష్ పన్వార్, మహేంద్రుని విష్ణోయి నుండి , బైతు నుండి హరీష్ చౌదరి, వల్లభ్‌నగర్ నుండి ప్రీతి గజేంద్ర సింగ్ షెకావత్, దుంగార్‌పూర్ నుండి గణేష్ గోఘ్రా, బగిదొర నుండి మహేంద్ర జీత్ సింగ్ మాల్వియా, కుషాల్‌ఘర్ నుండి రాంలీలా ఖాడియా, ప్రాతఘర్ నుండి రాంలాల్ మీనా, భీమ్ నుండి సుదర్శన్ సింగ్ రావత్ మరియు భీం నుండి సుదర్శన్ సింగ్ రావత్, వివేక్‌ఘర్కా నుండి టిక్కెట్లు హిందోలి నుండి కనుగొనబడ్డాయి.రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి రెండో జాబితాను భారతీయ జనతా పార్టీ ప్రకటించింది. ఇప్పటికే 41 స్థానాలకు తొలి విడతలో అభ్యర్థులను ఖరారు చేసిన బీజేపీ.. తాజాగా మరో 83 మంది అభ్యర్థుల పేర్లతో కూడిన రెండో జాబితాను వెల్లడించింది. రాజస్థాన్ మాజీ సీఎం వసుంధరా రాజే మరోసారి ఝల్రాపటన్ నియోజకవర్గం నుంచే పోటీ చేయనున్నారు. 2003 నుంచి ఇదే నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు వసుంధరా రాజే. రాజస్థాన్ బీజేపీ రాష్ట్ర శాఖ మాజీ అధ్యక్షుడు సతీష్ సుభాష్ చంద్ర పూనియా అంబీర్ స్థానం నుంచి, రాజస్థాన్ బీజేఎల్పీ నాయకుడు రాజేంద్ర రాథోడ్ తారానగర్ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచి బీజేపీలో చేరిన జ్యోతి మిర్ధా నాగౌర్ స్థానం నుంచి అభ్యర్థిగా ప్రకటించింది బీజేపీ. 200 అసెంబ్లీ స్థానాలున్న రాజస్థాన్ అసెంబ్లీకి బీజేపీ ఇప్పటివరకు 124 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసినట్లయ్యింది. మరో 76 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది.అలాగే రాజస్థాన్‌లో బరిలోకి దిగుతున్న బహుజన్ సమాజ్ పార్టీ తన 10 మంది అభ్యర్థులను ప్రకటించింది. మాయావతి పార్టీ అజ్మీర్, భరత్‌పూర్, కమ్మ, మహువ, తోడభీమ్, సపోత్రా, గంగాపూర్, నీమ్‌కథానా, హిండన్, బండికుయ్‌ల నుంచి టిక్కెట్లు ఇచ్చింది.



# హమాస్-ఇజ్రాయిల్ దాడుల్లో 22 మంది జర్నలిస్టులు మృతి

**టీ మీడియా, అక్టోబర్ 21, గాజా :**

హమాస్-ఇజ్రాయిల్ మధ్య జరుగుతున్న దాడులు 15వ రోజుకు ఎంటర్ అయ్యాయి. అయితే అక్టోబర్ 7వ తేదీ నుంచి జరుగుతున్న ఫైటింగ్‌లో ఇప్పటి వరకు 22 మంది జర్నలిస్టులు మృతిచెందారు. దీంట్లో 18 మంది పాలస్తీనియన్లు, ముగ్గురు ఇజ్రాయిలీలు, ఓ లెబనీస్ జర్నలిస్టు ఉన్నారు. సీపీజే (కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్) ఈ విషయాన్ని వెల్లడించింది. ఇజ్రాయిల్ చేసిన దాడుల వల్లే 15 మంది జర్నలిస్టులు మృతిచెందినట్లు సీపీజే పేర్కొన్నది. ఇక హమాస్ చేసిన దాడుల్లో ఇద్దరు జర్నలిస్టులు ప్రాణాలు కోల్పోయారు. 8 మంది జర్నలిస్టులు గాయపడ్డారు. మరో ముగ్గురు ఆచూకీ లేరు. మరో వైపు ఈజిప్ట నుంచి సహాయ సామాగ్రి ప్రస్తుతం రాఫా బోర్డర్ వరకు చేరుకున్నది. గాజాకు సరకుల్ని పంపేందుకు రాఫా క్రాసింగ్ వద్ద ట్రక్కుల్ని నిలిపారు. ఐక్యరాజ్యసమితికి చెందిన వాహనాలు అక్కడకు చేరుకున్నట్లు తెలుస్తోంది. ఇజ్రాయిలీలు సుమారు 200 మందిని కిడ్నాప్ చేసిన విషయం తెలిసిందే. దాంట్లో ఇద్దరు అమెరికన్లను హమాస్ ఉగ్రవాదులు వదిలేశారు. తల్లీకూతుళ్లను వదిలినట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొన్నది. బందీలందర్నీ విడిచిపెట్టే వరకు పోరాటం కొనసాగుతుందని ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమన్ నెతాన్యూ తెలిపారు. దాడుల్లో ఇప్పటి వరకు గాజాలో సుమారు నాలుగు వేల మంది మృతిచెందినట్లు తెలుస్తోంది.

# నవంబర్ 1 నుంచి 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారంటీ'

**నారా లోకేశ్**

**టీ మీడియా, అక్టోబర్ 21, మంగళగిరి :**



నవంబర్ 1 నుంచి బాబు ష్యూరిటీ.. భవిష్యత్ కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తెలిపారు. శనివారం టీడీపీ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల్లోకి తోసేసిందని విమర్శించారు. నవంబర్ 1 నుంచి బాబు ష్యూరిటీ.. భవిష్యత్ కు గ్యారంటీ కార్యక్రమంలో సూపర్ సిక్స్ హామీలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. వ్యక్తిగతంగా కాకుండా, రాజకీయంగా పోరాడదామని చంద్రబాబు చెప్పారని వెల్లడించారు. వచ్చే వారం నుండి 'నిజం గెలవాలి' పేరుతో తన తల్లి భువనేశ్వరి ప్రజల్లోకి వెళ్తున్నారని తెలిపారు. ఇప్పటికే టీడీపీ-జనసేన జేఏసీ ఏర్పాటు చేశామని, వైసీపీకి వ్యతిరేకంగా టీడీపీ-జనసేన కలిసి పోరాడతాయని అన్నారు. ఐదు రూపాయిల పేటిఎం బ్యాచ్ తో టీడీపీ, జనసేన జాగ్రత్తగా ఉండాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో 175కు 160 స్థానాలు గెలిచి, జగన్ ను చిత్తు చిత్తుగా ఓడించడం ఖాయమని తెలిపారు. చంద్రబాబును అరెస్టు చేస్తే టీడీపీ నేతలు భయపడుతారనుకున్నారని, టీడీపీ నేతలకు ఎలాంటి భయం లేదని పేర్కొన్నారు.

# చంపేందుకు రంగంలోకి సుపారీ

- సిట్టింగ్ ఎమ్మెల్యే కుట్రలు
- మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్ రావు

**టీ మీడియా, అక్టోబర్ 21,మంచిర్యాల బ్యూరో:**
ఎన్నికల సమయం దగ్గర పడుతున్న వేళ కాంగ్రెస్ సీనియర్ నేత చేసిన కామెంట్స్ సంచలనంగా మారాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే తనను చంపాలని సుపారీ గ్యాంగ్ పక్కా రాష్ట్రాల నుండి రంగంలోకి దింపారని.. జిల్లాలో అలజడి రేపి లబ్ధి పొందాలని చూస్తున్నారని సంచలన ఆరోపణలు చేశారు. ఆ మాజీ ఎమ్మెల్సీ వ్యాఖ్యలు ఇప్పుడు ఆ నియోజకవర్గం వర్గంలో తీవ్ర చర్చకుదారితీశాయి. ఇంతకీ ఎవరా నేత.. ఆయన చేసిన ఆరోపణల్లో నిజమెంత. మంచిర్యాలలో మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్ రావు సిట్టింగ్ ఎమ్మెల్యే కం బీఆర్ఎస్ అభ్యర్థి నడిపెల్లి దివాకర్ రావు పై సంచలన ఆరోపణలు



చేశారు. తనను హతగయ చేసేందుకు నియోజక వర్గంలో విద్వంసం సృష్టించేందుకు.. ఎమ్మెల్యే దివాకర్ రావు ఆయన కొడుకు విజిత్ రావు కలిసి కుట్రలు పన్నారని.. రాయలసీమ, ఆంధ్ర ప్రాంతం నుంచి సుపారీ గ్యాంగ్ ను రంగంలోకి దింపారని సంచలన ఆరోపణలు చేశారు. మంచిర్యాల నియోజక వర్గంలో ఘర్షణలు చెలరేగేలా చేసి శవరాజకీయాలతో లబ్ది పొందాలని కుట్రలు పన్నుతున్నారని ఎమ్మెల్యే దివాకర్ రావు పై మాజీ ఎమ్మెల్సీ కాంగ్రెస్ మంచిర్యాల అభ్యర్థి ప్రేంసాగర్ రావు తీవ్ర ఆరోపణలు చేశారు. శుక్రవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రేమ్ సాగర్ రావు ఈ వ్యాఖ్యలు చేశారు.

వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదని గమనించిన ఎమ్మెల్యే దివాకర్ రావు.. గుంటూరు, కర్నూల్ నుంచి గుండాలను తీసుకువచ్చాడని.. ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులోనే వారికి రెండు నెలలుగా ఆశ్రయం ఇచ్చాడని.. వారి అడ్రస్ లతో వివరించారు మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్ రావు. రానున్న ఎన్నికల్లో గొడవలు, అలజడలు సృష్టించి మంచిర్యాల జిల్లా ప్రజలను భయపెట్టేందుకు భారీ కుట్ర పన్నారని ఆరోపించారు.రెండు రోజుల క్రితం వారి ఆచూకీ బయటపడడంతో మకాం మార్చారని%ళా% తనపై భౌతిక దాడులు చేయాలని ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే దివాకర్ రావు పాలనలో నియోజకవర్గం లో గంజాయి విచ్చలవిడిగా అమ్మకాలు కొనసాగాయని.. యువత మత్తుకు బానిసలు అయ్యారని ఆరోపించారు.

## ఏపీలో పోలీస్ సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట

**ఏపి సిఎం జగన్**

**టీ మీడియా, అక్టోబర్ 21, విజయవాడ :**
నిర్వహణలో అమరులైన పోలీస్ సిబ్బందికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్ ఉద్యోగం అనేది ఓ సవాల్.. బాధ్యత. అలాంటి పోలీస్ కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. విధి నిర్వహణలో ప్రాణం వదిలిన పోలీస్ కుటుంబానికి ప్రభుత్వం తోడుగా ఉంటుందన్నారు. ఇక, ప్రస్తుత రోజుల్లో నేరం తన రూపాన్ని మార్చుకుంటోందన్న ఆయన.. కొత్త టెక్నాలజీ వల్ల సైబర్ సెక్యూరిటీ నుంచి డేటా చోరీ వరకు నేరాలు జరుగుతున్నాయన్నారు.. ఈ పరిస్థితుల్లో పోలీసులు అప్డేట్ అవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఫోన్లు, స్మార్ట్ ఫోన్లు, ఇంటర్ నెట్ వాడకం ద్వారా సైబర్ ప్రపంచంలో చీకటి ప్రపంచం సృష్టించుకున్న వారిని ఎదుర్కోవాల్సిన బృహత్తర బాధ్యత పోలీసులపై ఉందన్నారు. అక్టోబర్ 21 పోలీస్ అమరుల సంస్మరణ దినం. గడిచిన 64 ఏళ్లుగా దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. విధి నిర్వహణలో అమరులైన పోలీస్ త్యాగాలను స్మరించుకునే రోజు ఈరోజు. దేశప్రజలంతా మన పోలీసులను మనసులో సెల్యూట్ చేసే రోజు. ఈ రోజున అమరులైన పోలీసులందరికీ శ్రద్ధాంజలి ఘటిస్తున్నా అని సీఎం జగన్ ప్రసంగించారు. విధి నిర్వహణలో ప్రాణాలు వదిలిన పోలీస్ సోదరులకు ప్రభుత్వం అన్నివిధాలుగా తోడుగా ఉంటుందని ఆయన ఉద్ఘాటించారు. అంగళ్లులో ప్రతిపక్ష పార్టీ పోలీసులపై దాడులు చేయించింది. పుంగనూరులో ఘటనలో 40 మంది పోలీస్ సిబ్బందికి గాయలు అయ్యాయి. ఓ పోలీస్ కన్ను కోల్పోయారు. న్యాయమూర్తులుపైనా ట్రోలింగ్ చేస్తున్నారు. అలాంటి దుష్టశక్తుల విషయంలో కఠినంగా ఉండాలి అని పోలీసులకు సూచించారు.

## కాంగ్రెస్ అసమర్ధత వల్లే కర్ణాటకలో కరెంట్ కష్టాలు

**మంత్రి కేటీఆర్**

**టీ మీడియా, అక్టోబర్ 21, హైదరాబాద్ :**
కర్ణాటకలో రైతులు ఆ బాధలు అనుభవిస్తున్నారని కేటీఆర్ ట్వీట్ చేశారు. కర్నాటక ప్రభుత్వం రైతాంగానికి కరెంటు ఇవ్వడానికి నానా తంటాలు పడుతోంది. వ్యవసాయ రంగానికి సరిపడా విద్యుత్ సరఫరా చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని రైతులు మండిపడుతున్నారు. యాద్గిర్‌లో ఏడు గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘాల ఆధ్వర్యంలో గురువారం విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. విద్యుత్ సరఫరా సరిగా లేకపోవడంతో జిల్లాలో మిర్చి, పత్తి, ఎర్రజొన్న, వరి పంటలు చాలా వరకు దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.




## ఏపీ హైకోర్టు న్యాయమూర్తులుగా నలుగురి ప్రమాణ స్వీకారం

**టీ మీడియా, అక్టోబర్ 21, విజయవాడ:**
ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా నియమితులైన హరినాథ్ నూనెపల్లి, కిరణ్మయి మండవ, సుమతి జగడం, న్యాపతి విజరు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ వీరితో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ఏపీ హైకోర్టు సీజే, న్యాయమూర్తులు, సీఎం జగన్, నూతన న్యాయమూర్తుల కుటుంబసభ్యులు, ఏపీ హైకోర్టు ఛీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, హౌం మంత్రి తానేటి వనిత, మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్యేలు వెల్లంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు, పలువురు హైకోర్టు న్యాయమూర్తులు తదితరులు హాజరయ్యారు.



## బంజారాహిల్స్‌లో పోలీసుల తనిఖీలు

- రూ. 3.50 కోట్లు స్వాధీనం

**టీ మీడియా, అక్టోబర్ 21, హైదరాబాద్ :**
తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల అధికారులు, పోలీసులు ఎక్కడికక్కడ విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం ఉదయం బంజారాహిల్స్‌లో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఏఎమ్మార్ గ్రూప్ సంస్థల చైర్మన్ మహేశ్ రెడ్డి కారులో రూ. 3.50 కోట్లు పట్టుబడ్డాయి. ఆ నగదుకు సంబంధించి ఎటువంటి రశీదు లేకపోవడంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించారు. ఆయన పక్క రాష్ట్రాల నుంచి డబ్బులు తీసుకొచ్చి రాజకీయ పార్టీలకు అందజేస్తున్నట్లు తేలింది. దాంతో ఆయనకు సంబంధించిన ఏఎమ్మార్ గ్రూప్ సంస్థల్లో కూడా తనిఖీలు చేపట్టారు. మహేష్ రెడ్డి ఏ పార్టీ కోసం డబ్బులు తెస్తున్నారనే దానిపై ఐటీ అధికారులు ఆరా తీస్తున్నారు.

# 365 రోజులు ప్రజల మధ్యలో ఉండటమే

### ఎంఐఎం మేనిఫెస్టో రిలీజ్!

**టీ మీడియా, అక్టోబర్ 21,హైదరాబాద్**
కూడా ప్రకటించాయి. హుస్నాబాద్ బహిరంగ సభతో ముఖ్యమంత్రి కేసీఆర్ తమ ఎన్నికల శంఖారావాన్ని కూడా పూరించారు. అధికారంలోకి వస్తే ఏం చేస్తామో ప్రజలకు చెబుతూ.. ప్రచారం కొనసాగిస్తున్నారు. అంతేకాకుండా ఎన్నికల మేనిఫెస్టో సైతం విడుదల చేశారు.ప్రతి రాజకీయ పార్టీకి ఎన్నికల మేనిఫెస్టో చాలా కీలకం. ఆ మేనిఫెస్టోని బట్టే గెలుపు పోటములు ఆధారపడి ఉంటాయన్నదీ రాజకీయ విశ్లేషకుల నమ్మకం. అధికారంలోకి వస్తే ప్రజలకు ఏమి చేస్తామో చెబుతూ.. పార్టీలు హామీల రూపంలో మేనిఫెస్టోను విడుదల చేస్తాయి. ప్రత్యర్థి పార్టీలంటే అధికంగా మేలు ప్రజలకు జరిగేలా మేనిఫెస్టోను తయారు చేసి ఎన్నికలకు వెళ్తుంటాయి. ఈ క్రమంలో ఆల్ ఇండియా మజ్లిస్ ఎ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఎంఐఎం) కూడా తన మేనిఫెస్టోని విడుదల చేసింది. 365 రోజుల పాటు ప్రజల మధ్యలో ఉండటమే తమ ఎజెండా అంటూ ప్రకటించింది ఎంఐఎం పార్టీ. కౌన్సిలర్లు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు అంతా పార్టీ ఆఫీసులో నేరుగా ప్రజలను కలవడమే తమ మేనిఫెస్టోలో ప్రధాన అంశమంటూ ఆల్ ఇండియా మజ్లిస్ ఎ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ అధ్యక్షుడు హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ప్రకటన చేశారు. సాధారణంగా పాతబస్తీలో ఏ చిన్న కార్యక్రమం అయినా, చివరికి చావు బతుకులు జరిగినా ఎంఐఎం నేతలు అందుబాటులో ఉంటారని తెలిపారు. చిన్న నేత నుంచి ఎంపీ స్థాయి వరకు అంతా వెళ్లి హాజరవుతామన్నారు. ప్రజలు పిలవడమే ఆలస్యం వెంటనే అక్కడికి చేరుకుంటారు. పెళ్లి వేడుకలకు సైతం పిలిచినా పిలవకపోయినా వెళ్లి వధూవరులను ఆశీర్వదిస్తుంటారని ఆసద్ మొదటి హామీగా ప్రకటించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలిగిన అదుకునేందుకు కౌన్సిర్లు, ఎమ్మెల్యేలు వెంటనే అక్కడికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తారని ఎంపీ వెల్లడించారు. ఇలా నిత్యం జనాల్లో ఉండే ప్రయత్నం దేశంలో ఏ పార్టీ చేయదని ఎంఐఎం నేతలు అంటున్నారు. అంతేకాకుండా తాము చెప్పిందే చేస్తామని, చేసేదే చెబుతామని ఆ పార్టీ నేత ఆసద్ భరోసా ఇచ్చారు. అయితే ఎంఐఎం మేనిఫెస్టో చూసిన రాజకీయ పార్టీలన్నీ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయి.

సాధారణంగా ఎన్నికలు సమీపిస్తే చాలు అనేక హామీలు, ఎన్నో వాగ్దానాలతో రాజకీయ పార్టీలు ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తుంటాయి. ఆ హామీలు నచ్చితే జనాలు ఆయా పార్టీలకు ఓట్లు వేస్తుంటారు. కానీ కేవలం ప్రజల్లోనే ఉంటామంటూ.. ఆల్ ఇండియా మజ్లిస్ ఎ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ మేనిఫెస్టో ప్రకటించడంతో అంతా ఆశ్చర్యపోతున్నారు. జనానికి ఏం చేస్తారో చెప్పాలన్నారు. ప్రజాస్వామ్యంలో గెలిచి ప్రజా ప్రతినిధి ఎవరైనా సరే.. జనంలో ఉండాల్సిందే కదా అని నిట్టూరుస్తున్నారు.

# ఆరుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లు కట్

- కాంగ్రెస్‌లో భగ్గుమన్న ఆసమ్మతి

**టీ మీడియా, అక్టోబర్ 21,మధ్యప్రదేశ్ :**
ఎమ్మెల్యేలు గెలిచారు. వీరిలో సుమావాలి ఎమ్మెల్యే అజబ్ సింగ్ కుష్వాహా, బియోరా ఎమ్మెల్యే రామచంద్ర డాంగి, గోహద్‌కు చెందిన మేవరం జాతవ్, మోరెనాకు చెందిన రాకేష్ మావై ఉన్నారు. ఈ జాబితాలో చేర్చిన ఎమ్మెల్యేలలో బద్‌నగర్ స్థానం నుండి మురళీ మోర్వాల్, సెంద్వా స్థానం నుండి గ్యార్సీలాల్ రావత్ కూడా ఉన్నారు.ఇదిలా ఉండగా, తనకు టికెట్ కేటాయించకపోవడంతో కాంగ్రెస్ పార్టీపై ఆగ్రహం వ్యక్తం చేసిన రాకేష్ మావై. రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ కమల్ నాథ్‌ను నిలదీసేందుకు సిద్ధమయ్యారు. ఏం తప్పు చేశానని టిక్కెట్ ఇవ్వలేదని మండిపడ్డారు. 2020లో కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఉప ఎన్నికలో గెలిచారు. అయితే తనకు తన కుటుంబానికి బీజేపీ నేత సింధియాతో సంబంధాలు ఉండటం తప్పా అని ప్రశ్నించారు. నిజమైన కాంగ్రెస్ కార్యకర్తనని, విద్యార్థి దశ నుంచి పార్టీతో అనుబంధం కలిగి ఉన్నానన్నారు. ఎన్ఎస్‌యుఐ, యూత్ కాంగ్రెస్‌లో కూడా పనిచేశానన్నారు. ఇతర అభ్యర్థుల్లా బిఎస్‌పి, బిజెపి నుంచి పార్టీలోకి రాలేదని మండిపడ్డ రాకేష్.. 2018లో జిల్లా నుండి పంచాయతీ చీఫ్ ఎన్నికలో గెలిచాను, పంచాయతీ ఎన్నికల నుండి అసెంబ్లీ ఎన్నికల వరకు ఎనిమిది సార్లు ఎన్నికల్లో పోటీ చేసి ఎన్నడూ ఓడిపోలేదు, అప్పుడు పార్టీ ఎందుకు విశ్వసించడం లేదు? అని ప్రశ్నించారు.మరో సీనియర్ నేత మురళీ మోర్వాల్ కూడా కాంగ్రెస్ అధిష్టానం తీరుపై ఫైరయ్యారు. బీజేపీలో చేరేందుకు రూ.40 కోట్లు ఆఫర్ చేశారని, అయితే తాను కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగానే ఉన్నానని మురళీ మోర్వాల్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వకుండా చేసిన ద్రోహాన్ని ఎప్పటికీ మరిచిపోలేనని ఆయన మండిపడ్డారు. అంతర్గత సర్వే ఆధారంగా బద్‌నగర్ నుంచి రాజేంద్రసింగ్ సోలంకీ, సెంద్వా నుంచి మోంటు సోలంకీ, సుమావాలిలో కుల్‌దీప్ సికర్వార్, బియోరాలో పురుషోత్తం డాంగీ, గోహద్‌లో కాశవ్ దేశాయ్, మోరెనాలను బరిలోకి దింపడం గమనార్హం. రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చీఫ్ దినేష్ సింగ్ గుర్జర్‌కు టిక్కెట్ ఇచ్చారు.

# ధ్వని వేగంతో దూసుకెళ్లిన టీవీ-డీ1

- ఇస్రో చైర్మెన్

**టీ మీడియా, అక్టోబర్ 21, శ్రీహరికోట:**
గగన్‌యాన్ మిషన్ లో భాగంగా నిర్వహించిన టీవీ-డీ1 ఫ్లయిట్ టెస్ట్ ప్రయోగం సక్సెస్ అయిన విషయం తెలిసిందే. అయితే ఆ టీవీ-డీ1 మిషన్ రాకెట్ దాదాపు ధ్వని వేగం కన్నా అధిక వేగంతో దూసుకెళ్లినట్లు ఇస్రో చైర్మెన్ సోమనాథ్ తెలిపారు. టీవీ-డీ1 పరీక్ష సక్సెస్ కావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. క్రూ ఎస్కేప్ సిస్టమ్‌ను పరీక్షించడంలో భాగంగా ఈ ప్రయోగాన్ని చేపట్టామన్నారు. టీవీ-డీ1 వెహికల్ మ్యాక్ వేగంతో అంటే ధ్వని వేగంతో దూసుకెళ్లినట్లు




వెల్లడించారు. నింగిలోకి వెళ్లిన తర్వాత.. అన్ని ప్రక్రియలు సవ్యంగా సాగినట్లు ఆయన తెలిపారు. మూడు పారాచూట్ల సాయంతో క్రూ ఎస్కేప్ మాడ్యూల్ బంగాళాఖాతంలో దిగినట్లు చెప్పారు. అందుబాటులో ఉన్న డేటా ఆధారంగా మరిన్ని వివరాలను వెల్లడించనున్నట్లు సోమనాథ్ తెలిపారు. టీవీ-డీ1 పరీక్ష వాయిదా వేయడానికి గల కారణాన్ని ఆయన వెల్లడించారు. 8 గంటలకు వెదర్ సరిగా లేని కారణంగా పరీక్షను 8.45 నిమిషాలకు వాయిదా వేసినట్లు చెప్పారు. అయితే 8.45 నిమిషాల సమయంలో ఇంజిన్ ఇగ్నిషన్ లోపం తలెత్తడంతో ప్రయోగాన్ని నిలిపివేశారు. కానీ ఇస్రో శాస్త్రవేత్తలు వెంటనే ఆ లోపాన్ని గుర్తించారు. ఆటోమెటిక్ లాంచ్ సీక్వెన్స్ కంప్యూటర్ సంకేతాల ద్వారా పరీక్షను వాయిదా వేశారు. థ్రస్టింగ్ లోపం వల్ల ప్రయోగాన్ని నిలిపాల్సి వచ్చింది. చాలా వేగంగా రాకెట్‌లో మళ్లీ వాయువులను నింపామని, మిషన్ కంప్యూటర్ సంకేతం ఇచ్చిన తర్వాత రాకెట్‌ను రిలీజ్ చేసినట్లు వెల్లడించారు.



# రోజు రోజుకు పుంజుకుంటున్న కాంగ్రెస్

**టీ మీడియా, అక్టోబర్ 21, పెద్దపల్లి బ్యూరో :**
కాల్వశ్రీరాంపూర్ మండలం,వెన్నంపల్లి గ్రామానికి చెందిన యువకులు మేడి రాజు దాసరి సందీప్ ఏరవెల్లి సది, కాసారపు రాజు కాసారపు అనిల్, కలవేన రవి, కలవేన నాగరాజు కలవేన అజయ్ నల్లతీగల రవి నిమ్మతిరాజుకుమార్ ముస్కె అజయ్ గోస్కులరాజు,మేడి రవీందర్ జనగాం పైడి సాగర్ల సంజీవ్ అంకం శ్రీకాంత్ మేడి వెంకటేష్ కలవేన మహేందర్ వెళ్తూరి శ్రీరామ్ ముష్క గణేష్ చిర్లవంచ నాగరాజు పావునూరి సాయికుమార్ మాష్క కుమార్ కలవేన సతీష్, ఏరవెల్లి రఘు పెద్దపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే టీపీసీసీ ఉపాధ్యక్షులు చింతకుంట విజయరామణ రావు గారి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికీ కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించి రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే విధంగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాల్వశ్రీరాంపూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు మరియు తదితరులు పాల్గొన్నారు.



## ఇస్రో బృందానికి సీఎం జగన్ అభినందనలు

**టీ మీడియా, అక్టోబర్ 21, తాడేపల్లి:**
టెస్ట్ వెహికల్ ఫ్లైట్ టీవీ-డీ1 సక్సెస్‌పై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఇస్రో బృందానికి సీఎం అభినందనలు తెలిపారు. అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానంలో మరింత ఎత్తైన కక్ష్యలోకి ఇస్రో దూసుకెళ్లోందంటూ సీఎం జగన్ కొనియాడారు.భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న గగన్‌యాన్ మిషన్‌లో తొలి అడుగు పడింది. ఇస్రో తొలి పరీక్ష 'టెస్ట్ వెహికిల్ అబార్ట్ మిషన్'(టీవీ-డీ1) ప్రయోగం విజయవంతమైంది. శనివారం ఉదయం శ్రీహరికోట నుంచి నింగిలోకి రాకెట్ దూసుకెళ్లగా.. క్రూ మాడ్యూల్ పారాచూట్‌ల సాయంతో కిందకు సురక్షితంగా ల్యాండ్(సముద్రంలోకి) అయ్యింది. గగన్‌యాన్‌లో వ్యోమగాముల భద్రతకు సంబంధించి కీలకమైన ఈ సన్నాహక ప్రయోగం సక్సెస్ కావడం పట్ల.. ఇస్రో శాస్త్రవేత్తలు సంతోషం వ్యక్తం చేశారు.

## హైదరాబాద్‌లో మరోసారి ఐటీ రైడ్స్

**- రూ.3 కోట్లు స్వాధీనం**

**టీ మీడియా, అక్టోబర్ 21, హైదరాబాద్ :**
ఎన్నికల వేళ రాష్ట్రంలో మరోసారి ఐటీ సోదాలు కలకలం రేపుతున్నాయి. శనివారం నగరంలోని 12 చోట్ల ఏఎమ్ఆర్ గ్రూప్ సంస్థల్లో ఐటీ, ఈసీ అధికారులు తనిఖీలు చేపట్టారు. సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు కంపెనీ ఎండీ మహేష్ రెడ్డి ఇంట్లోను ఇన్‌కమ్ ట్యాక్స్ ఆఫీసర్లు సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో భాగంగా మహేష్ రెడ్డి ఇంట్లో అధికారులు రూ.3 కోట్లు స్వాధీనం చేసుకోవడంతో పాటు అతడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఏఎమ్ఆర్ కార్యాలయంతో పాటు కంపెనీ ఎండీ మహేష్ రెడ్డి ఇంట్లో ఇంకా అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# వియన్నా ఒప్పందాన్ని ఉల్లంఘించలేదు

## కెనడా ఆరోపణలపై భారత్



**టీ మీడియా, అక్టోబర్ 21, న్యూఢిల్లీ :**
దౌత్య సంబంధాల విషయంలో వియన్నా ఒప్పందాన్ని భారత్ ఉల్లంఘించలేదని విదేశాంగ శాఖ శనివారం తెలిపింది. భారత్‌లోని కెనడా దౌత్యవేత్తల సంఖ్యను తగ్గించాలని కోరడం ద్వారా భారత్ దౌత్య నిబంధనలను ఉల్లంఘించిందంటూ కెనడా విదేశాంగ మంత్రి మెలనీ జోలీ ఆరోపించారు. ఈ నేపథ్యంలో విదేశాంగ శాఖ ఈ ప్రకటన చేసింది. దౌత్య అధికారుల సంఖ్యను బలవంతంగా తగ్గించాల్సి రావడంతో చండీఘడ్, ముంబయి, బెంగళూరుల్లో తమ కాన్సులేట్లలో వ్యక్తిగత సేవలను నిలిపివేయాల్సి వచ్చిందని జోలీ తెలిపారు. ప్రస్తుతం ఢిల్లీలోని కెనడా హై కమిషన్‌లో మాత్రమే ఇటువంటి సేవలు అందుబాటులో వున్నాయి. ఇందుకు సంబంధించి వివరాలు, అనుసరించాల్సిన పద్ధతులను రూపొందించడానికి గత నెల రోజులుగా కెనడా పక్షంతో తాము చర్చలు జరుపుతున్నామని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. దౌత్య సంబంధాలపై వియన్నా ఒప్పందంలో 11.1 అధికరణకు అనుగుణంగానే తమ చర్యలు వున్నాయని ఆ ప్రకటన స్పష్టం చేసింది. భారత్‌లో చాలా అధిక సంఖ్యలో దౌత్యవేత్తలను కెనడా ప్రభుత్వం నిర్వహిస్తోందని భారత్ విదేశాంగ శాఖ ఆరోపించింది. భారత్ అంతరంగిక వ్యవహారాల్లో కెనడా పదే పదే జోక్యం చేసుకుంటుండడం వల్ల ఈ తగ్గింపు అవసరమైందని తెలిపింది. అంతర్జాతీయ నిబంధనలను ఉల్లంఘించే ప్రయత్నమిదని చూపించడానికి ఏ ప్రయత్నం చేసినా తాము తీవ్రంగా వ్యతిరేకిస్తామని ఆ ప్రకటన పేర్కొంది.

# రాహుల్‌పై పిల్ కొట్టివేత.. పిటిషనర్‌కు జరిమానా

## సుప్రీం ఆదేశాలు



**టీ మీడియా, అక్టోబర్ 21, న్యూఢిల్లీ :**
కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని పునరుద్ధరించడాన్ని సవాలు చేస్తున్న పిల్‌ను సుప్రీంకోర్టు శనివారం కొట్టివేసింది. పిటిషనర్‌కు రూ.లక్ష జరిమానా విధించింది. పిటిషనర్ ప్రాథమిక హక్కులేవీ ఉల్లంఘించబడలేదని, కేవలం చట్టక్రమాన్ని ఈ పిటిషన్ దుర్వినియోగం చేసిందని జస్టిస్ బి.ఆర్.గవారు నేతృత్వంలోని బెంచ్ పేర్కొంది. రాహుల్ గాంధీ సభ్యత్వాన్ని పునరుద్ధరించడాన్ని సవాలు చేస్తూ న్యాయవాది అశోక్ పాండే ఈ పిటిషన్ దాఖలు చేశారు. మోడీ ఇంటి పేరు గురించి 2019లో చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన కేసులో రాహుల్ నేర నిరూపణపై ఆగస్టు 4న సుప్రీం కోర్టు స్టే విధించింది. ఈ ఏడాది మార్చిలో హైకోర్టు నేర నిరూపణ చేసి, రెండేళ్ల జైలు శిక్ష విధించిన వెంటనే లోక్‌సభ సభ్యత్వానికి రాహుల్‌ను అనర్హుడిగా లోక్‌సభ సచివాలయం ప్రకటించింది. ఆగస్టు 4న సుప్రీంకోర్టు ఆ తీరుపై స్టే ఇవ్వడంతో లోక్‌సభ సచివాలయం రాహుల్ సభ్యత్వాన్ని పునరుద్ధరించింది.

# అవకాశం ఇస్తే కంటోన్మెంట్ నుండి పోటీ చేస్తా

## గద్దర్ కూతురు వెన్నెల



**టీ మీడియా, అక్టోబర్ 21,హైదరాబాద్:**
కాంగ్రెస్ అవకాశం ఇస్తే కంటోన్మెంట్ నుండి పోటీ చేస్తానని గద్దర్ కూతురు వెన్నెల పేర్కొంది. మీడియాతో మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు ఉద్యమించాలని గద్దరన్న అనుకున్నారు. ప్రజల కోసం కృషి చేశారు. సమసమాజం కోసం కృషి చేశారు.. ఎక్కని గడప లేదు. మొక్కని గుడి లేదు. కాంగ్రెస్ నాన్న నీ దగ్గరికి తీసుకున్నారు. మొదట్లో కాంగ్రెస్ సీట్ ఇస్తాము అన్నారు. ఇప్పుడు ఇంకా ఏమి మాట్లాడలేదు. ఒకవేళ సీట్ ఇవ్వకపోయినా కాంగ్రెస్ తోనే ఉంటాము. సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రం ఇవ్వడానికి ఇక్కడ ఉవ్వెత్తున ఎగసిన ఉద్యమం వల్లే కదా.. ఆమెకు గద్దరన్న గురించి తెలుసు అన్నారు. మా నాన్న 2014 నుంచి ఓటు వేస్తున్నాడు. చివరి దశలో మా తండ్రి కాంగ్రెస్ తో ఉన్నారు. యుద్ధం లో నిలబడటం గ్యారెంటీ. కాంగ్రెస్ సీట్ ఇచ్చినా ఇవ్వకున్నా.. ఎన్నికల్లో పోటీ చెయ్యడం ఖాయం అని స్పష్టం చేశారు. కంటోన్మెంట్ నియోజకవర్గం ప్రజలు కోరుతున్నారు.

# తెలంగాణ బలి దేవత సోనియా గాంధీనే

## ఎమ్మెల్సీ కవిత



**టీ మీడియా, అక్టోబర్ 21, మెట్‌పల్లి:**
కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బబ్బర్ షేర్ కాదని.. పేపర్ పులి మాత్రమేనని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. జగిత్యాల జిల్లాలో మెట్‌పల్లిలో మీడియాతో ఆమె మాట్లాడుతూ.. గాంధీ కుటుంబానికి తెలంగాణకు మధ్య విద్రోహక సంబంధం ఉందన్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం సీఎం కేసీఆర్ 2009లో దీక్ష చేస్తే ఇచ్చినటువంటి తెలంగాణను వెనక్కి తీసుకొని వందలాది బిడ్డల ప్రాణాలను తీసుకున్న ఇటలీ రాణి సోనియాగాంధీ బలిదేవత అని కవిత నిప్పులు చెరిగారు. జీవన్ రెడ్డి కొంచెం సోయి తెచ్చుకొని మాట్లాడాలని కవిత సూచించారు. నన్ను క్వీన్ ఎలిజబెత్ రాణి అని పిలుచుడు కాదు.. నేను మీ ఇటలీ రాణిని కాదు. మీ ఇటలీ రాని లెక్క నేను వందలాది తెలంగాణ బిడ్డల ప్రాణాలను నేను బలి తీసుకోలేదు. మీరు దిగజారిపోయి హోదాను మరిచిపోయి తెలంగాణకు ప్రతీక అయినటువంటి బతుకమ్మను అవమానించినా కూడా నేను సంయమనంతో మాట్లాడుతున్నాను అని కవిత వ్యాఖ్యానించారు. జగిత్యాల ప్రజలు జీవన్ రెడ్డిని తప్పకుండా తిరస్కరిస్తారని స్పష్టం చేశారు. జీవన్ రెడ్డి వయసు మరచి దిగజారి మాట్లాడుతున్నారన్నారు. సింగరేణి కార్మికులకు భారాస హయాంలోనే న్యాయం జరిగిందని ఈ సందర్భంగా కవిత తెలిపారు. భారాస మేనిఫెస్టో బీడీ కార్మికులకు పనికొచ్చే విధంగా ఉందన్నారు. ఉపాధి కోసం వెళ్లి గల్ఫ్‌లో చనిపోయిన వారికీ ప్రభుత్వ బీమా వర్తిస్తుందని హామీ ఇచ్చారు. గల్ఫ్‌లో ఉన్న వారి పేర్లు రేషన్ కార్డుల నుంచి ఎట్టి పరిస్థితుల్లోనూ తొలగించబోమని కవిత స్పష్టం చేశారు.

# పుణె-ఢిల్లీ విమానానికి బాంబు బెదిరింపు

## ముంబైలో ఎమర్జెన్సీ ల్యాండింగ్




**టీ మీడియా, అక్టోబర్ 21, ముంబై :**
పుణె నుంచి ఢిల్లీ వెళ్తున్న ఆకాశ విమానానికి బాంబు బెదిరింపు కాల్ వచ్చింది. దీంతో విమానాన్ని ముంబై ఎయిర్‌పోర్టులో అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. ఓ ప్రయాణికుడి తన బ్యాగులో బాంబు ఉందని బెదిరించడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ క్రమంలో విమానాన్ని ముంబై ఎయిర్‌పోర్టుకు మళ్లించి, ల్యాండ్ చేశారు. 40 నిమిషాల పాటు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి బాంబు లభ్యం కాకపోవడంతో పోలీసులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం విమానం ఢిల్లీకి బయల్దేరింది. అయితే బాంబు ఉందని బెదిరించిన ప్రయాణికుడు, తనకు ఛాతీలో నొప్పి వస్తుందని చెప్పడంతో, ముంబైలో విమానం ల్యాండైన వెంటనే ఆస్పత్రికి తరలించారు. అనంతరం అతనికి మెడిసిన్స్ ఇచ్చి పంపించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# యమునా ఎక్స్‌ప్రెస్‌వేపై ఘోర రోడ్డు ప్రమాదం

## ఐదుగురు మృతి



**టీ మీడియా, అక్టోబర్ 21, నోయిడా :**
గేటర్ నోయిడాలోని యమునా ఎక్స్‌ప్రెస్‌వేపై శుక్రవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. వ్యాన్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో కారులో ఉన్న ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందగా, ముగ్గురు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం కారణంగా యమునా ఎక్స్‌ప్రెస్‌వేపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించి, క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు మాట్లాడుతూ.. యమునా ఎక్స్‌ప్రెస్‌వేపై వేగంగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఎకో వ్యాన్ నంబర్ డిఎల్ 3 సిసి 7136ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో వ్యాన్ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో వ్యానులో ప్రయాణిస్తున్న 8 మందిలో 5గురు ఐదుగురు అక్కడికక్కడే మరణించారు. ముగ్గురు పిల్లలు గాయపడ్డారు. గాయపడ్డ వారిని చికిత్స కోసం జెవార్‌లోని కైలాష్ ఆసుపత్రిలో చేర్చారు. చిన్నారుల పరిస్థితి విషమంగా ఉంది. వ్యాన్‌లో ఉన్న వారంతా ఢిల్లీ నుంచి జార?ండ్ వెళ్తున్నారని పోలీసులు తెలిపారు. గ్రేటర్ నోయిడా నుంచి జేవార్ వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# మారణకాండను సమర్థిస్తున్నారా.?

## మండిపడ్డ పాలస్తీనా సంస్థ



**టీ మీడియా, అక్టోబర్ 21, జెరూసలెం :**
'ఈ యుద్ధంలో మీరు గెలవాలని మేం కోరుకుంటున్నాం' అంటూ బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యా హుతో చెప్పడంపై సర్వత్రా విమర్శలు, ఖండనలు వెల్లువెత్తాయి. సునాక్ చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే, 'ఈ ఊచకోత, మారణకాండ కొనసాగించేందుకు ఇజ్రాయిల్‌కు ఆమోదం తెలిపినట్లు వుంది.' అని పాలస్తీనా సాలిడారిటీ క్యాంపెయిన్ (పిఎస్‌సి) విమర్శించింది. ప్రతి రోజూ ఇజ్రాయిల్ బాంబు దాడుల్లో పదుల సంఖ్యలో ప్రజలు చనిపోతున్నారని, ఆహారం, నీరు, విద్యుత్, ఇంధనం లేకుండా గాజా ప్రజలు రోజుల తరబడి గడుపుతున్నారని ఆ గ్రూపు హెచ్చరించింది. కనీస సరఫరాలు లేక ఆస్పత్రులు దాదాపు కుప్పకూలే దశకు చేరుకున్నాయన్నారు. పిఎస్‌సి డైరెక్టర్ బెన్ జమాల్ మాట్లాడుతూ, సైనిక ఆక్రమణలో దశాబ్దాల తరబడి పాలస్తీనియన్లను అణచివేస్తున్న, వర్ణ వివక్ష వ్యవస్థను అమలు చేస్తున్న ఇజ్రాయిల్‌కు సంఘీభావం తెలియచేయడం కోసమే రిషి సునాక్ పర్యటన ఉద్దేశించినట్లైతే ఆయన దాన్ని రద్దు చేసుకోవాలని వ్యాఖ్యానించారు. సునాక్ మాట్లాడిన తీరు చూస్తుంటే అంతర్జాతీయ చట్టాలను పూర్తిగా విడిచిపెట్టి, యుద్ధ నేరాలకు పాల్పడడాన్ని సమర్థిస్తున్నారని అన్నారు. కాల్పుల విరమణ జరిపేలా ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తేవడం, గాజా దిగ్బంధనానికి అంతం పలకడం, గాజా ప్రజలకు మానవతా సాయం అందేలా చూడడం ఆయన ఈ పర్యటనలో సాధించదగ్గ ఏకైక విషయమని అన్నారు. కానీ, ఆయన అలా చేయలేదని, అది సిగ్గుచేటైన విషయమని జమాల్ విమర్శించారు.